# ఆ గుండెల చప్పుడు

నిజం! భయపడ్డాను. భయపడుతున్నాను. ప్రచండమైన భయంతో వాణికిపోతున్నాను నిజమే. కాని నాకు పిచ్చి అంటారేం మీరందరూ? ఈ జబ్బు నా ఇంద్రియాలను పదనుపెట్టింది. అంతేగాని నాశనం చెయ్యలేదు. అన్నిటికన్నా నా శ్రవణశక్తి తీవ్రతరమయింది. భూమ్యాకాశాలలో ఎక్కడ ఏపాటి చప్పుడైనా వినబడుతోంది. నరకంలో ధ్వనులెన్నో విన్నాను. మరి నాకు పిచ్చి అంటారేం? వినండి-ఎంత ఆరోగ్యంగా, ఎంత ప్రశాంతంగా మీకు నా కథంతా చెబుతానో.

నా మెదడులో మొదటిసారి ఈ ఊహ ఎలా ప్రవేశించిందో చెప్పలేను. కాని ప్రవేశించిన నాటినుండి రేయింబవళ్ళు నన్ను వేధించడం మొదలు పెట్టింది. ఉద్దేశం లేదు. కోపం లేదు. ఆ ముసిలాయనంటే పైగా నాకెంతో ప్రేమ. అత డెప్పుడూ నాకు ఏ అన్యాయం చెయ్యలేదు. ఎన్నడూ అవమానం చెయ్యలేదు. అతని బంగారం మీద నాకు ఆశ ఉన్నదా అంటే అదీ లేదు. నేననుకుంటాను, దీని కంతకీ కారణం అతని కన్ను! ఆ పాపిష్టి దిష్టి కన్ను! అదే, అదే అంతటికీ కారణం. రాబందు కన్నువంటి దున్నాది అతనికొక కన్ను. పాలిపోయిన నీలిరంగు కన్ను నీరుకారుతూ, ఆ కన్ను నామీద ఎప్పుడు పడ్డా నా రక్తం చల్లబడి పోయేది. అంచేత ఈ ముసిలి వాడిని చంపివేసి దిష్టికన్నుబాధ ఎప్పటికీ లేకుండా చేసుకోవాలన్న బుద్ధి పుట్టింది. హఠాత్తుగా కాదు. క్రమంగా, మెల్లమెల్లగా.

చూశారా, ఇదీ అసలు సంగతి. మీరేమో నేను పిచ్చివాడి ననుకుంటారు. పిచ్చివాళ్ళ కేమీ తెలియదు. కాని మీరు నన్ను చూడవలసింది. ఎంత కుశాగ్రబుద్ధితో, ఎంత జాగరూకతగా ఎట్టి ముందు చూపుతో వ్యవహరించానో చూడవలసింది మీరు. చంపడానికి ముందు వారం రోజులు ముసిలాడి అడుగులకు మడుగులొత్తుతూ ఎంతో అపేక్ష కనబరిచాను. ప్రతి రాత్రీ-రమారమి అర్థ రాత్రిసరికి అతని తలుపు గడియ తొలగించి మెల్లిగా ఓహో, కడు నింపాదిగా తలుపు తీసేవాణ్ణి. నా తల దూర్చడానికి వీలయినంతగా తలుపు ఓసరిల్లిన తర్వాత ముందుగా ఒక లాంతరును వెలుతురు ప్రసరించకుండా పూర్తిగా కప్పివేసి పట్టుకొని ఆ పిమ్మట తల దూర్చేవాడిని. అప్పటి నా జిత్తులమారి నేర్పు మీరు చూస్తే విరగబడి నవ్వుకొని ఉందురు. తల

మెల్లగా, ఓహో కడు మెల్లగా, మెలమెల్లగా, ముసిలాడికి నిద్రాభంగం కలగకుండా కదల్చేవాడిని. మంచంమీద పడుకున్న మనిషిని చూడగలిగేటట్లు తలంతా దూర్చడానికి కనీసం నాకొక గంటసేపు పట్టేది. హ్హా! పిచ్చివా డెవడైనా ఇంత తెలివితేటలు ప్రదర్శిస్తాడా? తర్వాత నా తల పూర్తిగా దూరడంతో లాంతరును జాగ్రత్తగా, జాగ్రత్తగా, చప్పుడు కాకుండా విప్పి ఒక్కటే కిరణం ముసిలాడి కంటిమీదకి ప్రసరించేటట్టు పట్టుకునేవాడిని. ఇలా ఏడు దీర్ఘ రాత్రులు చేశాను. సరీగా అర్ధరాత్రి వేళప్పుడు కాని ఎప్పుడూ ఆ కన్ను మూసుకునే వుండేది. అంచేత నా పని సాధ్యమయ్యేది కాదు. చెప్పాను కాదూ, ముసిలాడిమీద నాకేమీ కోపం లేదని. అంతా ఆ దిష్టికన్ను మహిమ! మళ్ళీ ప్రతి ఉదయం, తెల్లవారేసరికి ధైర్యంగా గదిలోకి వెళ్ళి, మనసారా ముసిలాణ్ణి పేరుపెట్టి పిలిచి ఆప్యాయంగా అడిగేవాణ్ణి హాయిగా రాత్రి నిద్రపోయారా అని! చూశారా ప్రతి రాత్రీ పంౘ్రెండు గంటలకి నేను చూస్తానని ముసిలాడు తెలుసుకుంటే అతడు మరీ దేవాంతకుడయి ఉండాలన్నమాట కాదూ?

ఎనిమిదో రాత్రి మామూలుకన్నా జాగ్రత్తగా తలుపు తెరిచాను. గడియారపు నిమిషాలముల్లు నాచేతికన్నా జోరుగా తిరుగుతుందని చెప్పవచ్చు. ఆ రాత్రికి ముందు ఎప్పుడూ నేననుకోలేదు, నాకింత శక్తి ఉందని, ఇంత తెలివైనవాడినని! నాలో పొంగి పొరలుతూన్న విజయోత్సాహాన్ని అరికట్టలేకపోయాను. మెల్లి మెల్లిగా అలా నేను తలుపు తెరుస్తూండడం, ఆ ముసిలాడికి నా రహస్యం కలలోనైనా అంతు పట్టకపోవడం సెబాస్! ఈ ఊహకి నాకే నవ్వొచ్చింది. ఏమో, నా నవ్వు వాడికి వినిపించి ఉండినా ఉండవచ్చును. ఎందువల్లనంటే ఎప్పుడూ లేనిది ముసిలాడు తుళ్ళిపడ్డట్టు అటునించి ఇటు మంచంమీద ఒత్తిగిల్లాడు. నేను వెనక్కి తగ్గిపోయాననుకుంటారు కదూ మీరు? అబ్బే! లేదు. దొంగల భయంచేత కిటికీలన్నీ మూసుకున్నాడేమో గది అంతా గాఢాంధకార బంధురంగా ఉంది. కాబట్టి తలుపు తెరుచుకోవడం అతనికి తెలియదని నాకు నిశ్చయమే. అందుచేత నిబ్బరంగా నా పని కానిచ్చాను.

తలదూర్చి, లాంతరు మూత తియ్యబోయేసరికి మూతమీదకి వేలు జారి చప్పుడయింది. ముసిలాడు దిగ్గుమని లేచి "ఎవరక్కడ?" అని అరిచాడు.

నేనేమీ కదలలేదు, మెదలలేదు. ఒక్కమాటైనా ఆడలేదు. ఒక గంటంటే గంటసేపు కరచరణాలు కదల్చకుండా విగ్రహంలాగు నిలుచుండిపోయాను. ముసిలాడు సద్దుకుని పడుకున్న చప్పుడేదీ నాకు వినబడలేదు. అలా వింటూ మంచం మీద కూర్చునే ఉన్నాడు, నాలాగే, ప్రతి రాత్రీ నేను మృత్యు నిశ్శబ్దాన్ని విన్నట్లే.

ఇంతట్లో నాకొక అరుపు వినిపించింది. విపరీతమైన భయం పుట్టినప్పుడు అరిచే అరుపు. నొప్పివల్లగాని, దుఃఖంవల్ల గాని అరిచే అరుపు కాదది. అబ్బే! లోతు లోతులనుంచి ఉబికే భయంవల్ల మానవుడు చేసే ఆక్రోశం. అలాంటి చప్పుడు నాకు బాగా తెలుసు. ఎన్నో రాత్రులు, సరీగా అర్థరాత్రప్పుడు అందరూ నిద్రించే సమయంలో నా గుండెలలో నుంచే ఇలాంటి చప్పుడు నన్ను కలవరపెడుతూ తన ప్రతి ధ్వనులతో నా భయాన్ని మరింత రెచ్చగొడుతూ ఉండేది. నేను చెబుతున్నానుగా, అది నాకు బాగా తెలుసు. ఆ ముసిలాడు అప్పుడేమనుకుంటూ ఉండాలో అది తెలుసు. అందుకు నా కతనిమీద జాలివేసింది. కాని లోలోపల నవ్వుకున్నాను. మొదటిసారి చప్పుడుకి మేలుకున్నప్పటి నుంచీ అలాగే కూర్చున్నాడని నాకు తెలుసు. అప్పటినించీ అతని భయం అలా అలా హెచ్చయిందనీ ఎరుగుదును. తన భయానికి కారణమేమీ లేదని నిబ్బరం చేసుకోబోయినప్పటికీ అది సాధ్యపడలేదు. నాకు తెలుసు, అతడు తనలో తాను—"అబ్బే అది ఈదర గాలిచప్పుడు అదేదో ఎలక కదలిన చప్పుడు, అంతే చిమ్మట కాబోలు ఒక్కమారు చప్పుడుచేసి ఊరుకుంది" అని అనుకుని ఉంటాడు. ఇలా అనుకొని ధైర్యం చెప్పుకొని ఉండాలి ఆ ముసిలాడు. కాని లాభంలేదు. ఏమీ లాభంలేక పోయింది. మృత్యు వతనికి ఆసన్నమయింది. నల్లటి నీడతో ఎదురుగుండా నిలబడింది. పూర్తిగా అతణ్ణి ఆవరించింది. ఆ కనబడని నీడవల్లనే అతడు గ్రహించి ఉంటాడు తలుపు సందులోంచి నేను తల దూర్చినట్టు. అంతేగాని నా తల అతనికి కనబడలేదు. ఏ చప్పుడూ వినబడలేదు.

ఎంతో ఓర్పుగా చాలాసేపు అలాగే ఆగిపోయిన పిమ్మట ఆ ముసిలాడు పడుకున్నట్టు చప్పుడేమీ వినపడక ఆఖరికి దీపంలో చిన్న సందు చెయ్యాలని సంకల్పం కలిగింది. అందుకని లాంతరు మూత తీశాను. ఎంత మెల్లిగా, ఎంత దొంగతనంగా, ఎంత నేర్పుగా తీశానో మీ రూహించలేరు. ఒకే ఒక కిరణం, సాలీడు దారంకన్నా సన్ననిది అతని రాబందు కంటిమీద పడింది.

ఆ కన్ను తెరుచుకొని ఉంది. విశాలంగా విప్పారుకొని ఉంది. దాన్ని చూస్తూ ఉంటే నాకు రౌద్రం రెచ్చిపోయింది. ఎంత స్పష్టంగా కనబడింది ఆ కన్ను! ఆ మాసిన నీలిరంగుతో, పలచని తెరలాంటి నీటి పొరతో! అది నా ఎముకల మూలుగులను దొలిచేస్తోంది. ముసిలాడి ముఖంగాని, శరీరంగాని మరేదీ కనబడనే లేదు. ఎందువల్లనంటే ఎవరో చెప్పి చేయించినట్టు సరిగా ఆ కంటిమీదకే లాంతరు వేశాను.

నేను చెప్పలేదూ మీకు? ఏదైతే పిచ్చి అని మీరనుకుంటారో అది నా ఇంద్రియాల తీవ్రశక్తి అని. మామూలుగా ఎవరికీ వినబడని చప్పుళ్ళు నాకు వినబడతాయి.

అలాగే ఒక సన్నని దడదడ, దూదిలో చుట్టిన వాచీ చేసే చప్పుడు విన్నాను. ఆ చప్పుడు కూడా ఇదివరలో నాకు బాగా పరిచితమైనదే. అది ముసలాడి గుండెలు కొట్టుకుంటున్న చప్పుడు. దానితో నా ఆగ్రహం మరీ అధికమైంది. యుద్ధరంగం లోనికి వెళ్ళుతూన్న సైనికునికి బాజాచప్పుడువల్ల ధైర్యం హెచ్చినట్లు.

కాని అప్పటికీ నేనేమీ చెయ్యకుండా నిశ్శబ్దంగా ఉన్నాను. గట్టిగా ఊపి రయినా తియ్యలేదు. కదల్చకుండా లాంతరును పట్టుకున్నాను. ఆ కంటి మీద ఎంత నిశ్చలంగా కిరణాన్ని నిలపగలనో చూదామనుకున్నాను. ఈలోగా గుండెల్లోని నరక ఘోష హెచ్చిపోయింది. క్షణక్షణానికీ మరీ జోరుగా, మరీ గట్టిగా హోరెత్తసాగింది. ముసలాడి భీతి అపరిమితమై ఉండాలి. చప్పుడు హెచ్చిపోతోంది. క్షణక్షణం హెచ్చుతోంది. విన్నారా? అనుక్షణం. నేనసలే భయస్తుణ్ని. ఈ నడిరాత్రివేళ, ఈ పాత ఇంటిలోని భయంకర నిశ్శబ్దం మధ్య, ఆ వింతచప్పుడు నాలో పట్ట పగ్గాలు లేని భయాన్ని రేకెత్తించింది. అయినా మరికొన్ని నిమిషాలపాటు ఏమీ చెయ్యకుండా నిశ్శబ్దంగా ఉన్నాను. కాని ఆ గుండెలు కొట్టుకుంటున్న చప్పుడు మరీ మరీ హెచ్చి పోతోంది. గుండె పటాలున బద్దలయిపోతుందనిపించింది. ఇంతట్లో ఇంకో కొత్త బెంగ పట్టుకుంది నన్ను! ఇరుగుపొరుగువా రెవరైనా ఈ శబ్దాన్ని వింటే? ముసలాడికి అవసానకాలం ఆసన్నమయింది. గట్టిగా ఒక కేకవేసి, లాంతరును కప్పిన కప్పు లాగిపారేసి, గదిలోకి లంఘించాను. ముసలాడు ఒక్కసారి అరిచాడు—ఒక్క సారి మాత్రం! రెప్పపాటులో అతణ్ణి నేలమీదకు లాగి బరువైన మంచాన్ని అతని మీదకు తిరగదోశాను. అంతవరకు జరిగిన పనికి హాయిగా ఒక నవ్వు నవ్వాను. కాని చాలా నిమిషాలదాకా ఆ గుండెలు నూతిలోని చప్పుడువంటి చప్పుడు చేస్తూనే ఉన్నాయి. కాని అందుకు నేను కలవరపాటు చెందలేదు. ఆ చప్పుడు గోడదాటి వినబడదు. ఇంతట్లో అదీ ఆగిపోయింది. ముసలాడు మరణించాడు. మంచం తొలగించి శవాన్ని పరిశీలించాను. నిజమే. ముసలాడు శిలాప్రాయంగా చచ్చిపోయి ఉన్నాడు. గుండెలమీద చెయ్యివేసి కొన్ని నిమిషాలపాటు అలాగే ఉంచాను. గుండెలు కొట్టుకో లేదు. ముసలాడు చచ్చాడు. వాడి కన్ను నన్నింక బాధించదు.

అయినా మీరింకా నన్ను పిచ్చివాడిగానే భావిస్తే మృతశరీరాన్ని దాచడానికి నేను తీసుకున్న జాగ్రత్తలన్నీ వివరించడంతో మీ దురభిప్రాయం పూర్తిగా మారి పోతుంది. రాత్రి గడచిపోతోంది, త్వరత్వరగా నేను నా పని సాగించాను. కాని ఏమాత్రం చప్పుడు చెయ్యకుండా అన్నిటికన్నా ముందు శవాన్ని ముక్కలు ముక్కలు చేశాను. తల, చేతులు, కాళ్ళు నరికివేశాను.

తర్వాత గది నేలమీది బల్లచెక్కలలో మూడింటిని తొలగించాను. వాటికింద ఈ ముక్కలన్నీ జాగ్రత్తగా ఉంచాను. తర్వాత బల్లచెక్కలను యధారీతిగా అమర్చి వేశాను. ఎంత తెలివితేటలతో, పనివాడితనంతో ఎంత మజాగా చేశానని ఈ పని! మానవనేత్రం ఏదీ, ఆఖరికి ఆ ముసలాడి నేత్రంకూడా, పోల్చుకోవడానికి వీలు లేనట్లు చేశాను. కడగవలసిందేమీలేదు. ఒక్క నెత్తురు మరకకూడా లేదు. అబ్బే. నేను చాలా జాగ్రత్తపడ్డాను. నెత్తురంతా ఒక డబ్బాలోకి తోడివేశాను.

ఈ పనులన్నీ ముగించినసరికి నాలుగు గంటలయింది. చీకటిమాత్రం అర్ధ రాత్రిలాగే ఉంది. నాలుగోగంట కొడుతూ ఉండగా వీధితలుపు ఎవరో తట్టిన చప్పు డైంది. నిర్భయంగా వెళ్ళి తలుపు తీశాను. ఇక నాకు భయపడవలసిన అవసర మేముంది? ముగ్గురు మనుష్యులు లోనికి ప్రవేశించారు. తాము పోలీసు ఉద్యోగులమని నెమ్మదిగా, మర్యాదగా తెలియబరుచుకున్నారు. పొరుగింటివాళ్ళు అర్థరాత్రప్పుడేదో అరుపు విన్నారట. కొట్లాట జరిగినట్లు అనుమానమయిందట. పోలీసు కార్యాలయా నికి ఫోగట్టా అందింది. ఈ యిల్లు సోదా చెయ్యడానికి వీరు వచ్చారు.

ఒక నవ్వు నవ్వాను. నా కెందుకూ భయం? ఆ పెద్దమనుష్యుల్ని దయచెయ్యం డన్నాను. ఆ అరుపు నాదే అన్నాను. కలలో అరిచానన్నాను. ముసిలాయన గ్రామాం తరం వెళ్ళాడని చెప్పాను. వారికి ఇల్లంతా చూపించాను. వెదకండి—బాగా వెద కండన్నాను. ఆఖరికి ముసిలాయన గదిలోకి తీసుకువెళ్ళాను. నా ఉత్సాహం మితిమీరి గదిలోకి కుర్చీలు తెచ్చి వారిని కూర్చోమనీ, యిక్కడే శ్రమ తీర్చుకోమనీ ప్రార్థించాను. నా మట్టుకు నేను పొంగిపొరలుతున్న విజయావేశంతో ముసిలాణ్ణి దాచిన చోటనే కుర్చీ వేసుకొని కూర్చున్నాను.

ఉద్యోగులకు సంతృప్తి కలిగించి నా ప్రవర్తన వారికి నమ్మకం కలిగిం చింది. నేను ధారాళంగా వర్తించాను. అడిగిన ప్రశ్నలకు కులాసాగా జవాబులిచ్చాను. ఆమాటా ఈమాటా, ముచ్చటించుకున్నాము. ఇంతట్లో నా మొగం పాలిపోతున్నట్లు అనిపించింది. వారు వెళ్ళిపోతే బాగుండుననిపించింది. తల నొప్పిగా ఉంది. చెవు లలో గింగురు శబ్దమవుతోంది. అయినా వాళ్ళు కూర్చునే ఉన్నారు. కబుర్లు చెపుతూనే ఉన్నారు. గింగురు శబ్దం మరింత స్పష్టమవుతోంది. ఇంకా సాగుతూ, మరీ స్పష్టమవు తోంది. ఆ దురవస్థను తప్పించుకోడానికి నేను యధేచ్ఛగా మాట్లాడుతున్నాను. కాని ఆ చప్పుడు మాత్రం ఆగలేదు. మరింత స్ఫుటమవుతుంది. ఆఖరికి నాకు బోధపడింది అది నా చెవిలోని చప్పుడుకాదని.

నా మొగం మరీ పాలిపోయిందనడానికి సందేహంలేదు. కాని మరీ జోరుగా మాట్లాడడం మొదలుపెట్టాను గొంతు హెచ్చించి. ఆ చప్పుడు ఇంకా హెచ్చింది. ఇక నేనేం జెయ్యాలి? ఆ చప్పుడు అదే! ఒక సన్నని దడదడ! దూదిలో చుట్టిన వాచీ చేసే చప్పుడు. ఆవురుమన్నాను. ఉద్యోగులుమాత్రం అది వినలేదు. జోరుగా, అలజడిగా మాట్లాడాను. చప్పుడుకూడా అలాగే హెచ్చింది, దిగ్గునలేచి అనవసరమైన అల్పవిషయాలనుగురించి బిగ్గరగా, చేతులు విసురుతూ వాదించాను. చప్పుడు మాత్రం హెచ్చుతూనే ఉంది. వీళ్ళు వెళ్ళరేం ఇంకా? గదిలో అటుఇటూ పచార్లుచేశాను, దబ దబా అడుగులువేస్తూ—వారినిచూస్తే నాకు కోపం వచ్చినట్లు. కాని చప్పుడు క్రమంగా హెచ్చుతూనే ఉంది. అయ్యో! దేవుడా! ఇక నేనేం చేదును? అరిచాను, మొత్తుకున్నాను, తిట్లు దిమ్మెత్తిపోశాను. నేను కూర్చున్న కుర్చీని అమాంతంగా ఎత్తిపట్టుకుని బల్ల చెక్కలమీద వేసి బాదడం మొదలుపెట్టాను. కాని అన్ని ధ్వనులనూ మించి ఆ చప్పుడు హెచ్చిపోతోంది, మరీమరీమరీ తీవ్రంగా! ఆ ముగ్గురూ చల్లగా నవ్వుతూ సరదాగా మాట్లాడుతూనే ఉన్నారు. బహుశా వాళ్ళకేమీ వినబడలేదు కాబోలు? ఓయి భగవంతుడా, లేదు—లేదు! వాళ్లు విన్నారు. అనుమానంపడ్డారు. తెలిసిపోయింది వాళ్ళకి. నా అవస్థ చూసి ఎగతాళిచేస్తున్నారు. అంతే! అలాగే అనుకుంటున్నాను అప్పుడూ ఇప్పుడూకూడా! కాని ఈ యమయాతనకంటె ఇంకేదైనా నయమే. ఈ హేళనకంటె ఇంకేదైనా భరించవచ్చు. వాళ్ళ కపటపు నవ్వులు మరి సహించలేను. గట్టిగా అరవనైనా అరవాలి, లేదా చావనైనా చావాలనిపించింది. ఇంతట్లో మళ్ళీ! అదుగో! గట్టిగా, గట్టిగా, ఇంకా గట్టిగా!

"వినండి వెధవల్లారా! నిజం చెప్పేస్తున్నాను! ఈ బల్లచెక్కలు ఎత్తండి. ఇక్కడే! ఇక్కడే! ఆ వెధవ గుండెలు అరుస్తున్నాయి" అని గొంతు చించుకొని కేకలు వేశాను.

మూలం: Edgar Allan Foe

ముద్రణ: సూర్య ప్రభ 1945 మే

Edgar Allan Poe (1809—49) అమెరికన్ కథాకారుడు. కవి, విమర్శకుడు. బాద్ లేర్ ద్వారా స్విన్ బర్న్‌ను, స్విన్ బర్న్ ద్వారా శ్రీశ్రీ ని ప్రభావితుల్ని చేశాడు. బాద్ లేర్‌ను ప్రభావితుణ్ని చేసి Symbolism ఉద్యమానికి కారణభూతు డయ్యాడు.

ఈతని రచనలలో ముఖ్యమైనవి Tales of the Grotesque and Arabesque (1840), The Raven and Other Poems (1845).